క్లుప్తంగా

గ్రంథాలయంలో నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

సంతనూతలపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు గ్రేడ్-3 గ్రంథాలయ అధికారి కే సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వివిధ రంగాలపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కథలు చదివించడం, ఆటలు ఆడించడం, పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, క్విజ్, చెస్, క్యారమ్స్, డ్యాన్స్, తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సత్యనారాయణ కోరారు. విద్యార్థులకు స్వచ్ఛందంగా శిక్షణ ఇచ్చేవారు గ్రంథాలయాధికారిని సంప్రదించాలని ఆయన కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ ఉచిత వేసవి శిక్షణ తరగతులకు పంపించాలని విజ్ఞప్తి చేశారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న హిందూ జన సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మీనరసింహమూర్తి

ఒంగోలు మెట్రో: భారతదేశంలో సనాతన ధర్మం పరిరక్షణ ఎప్పుడూ ఉన్నతమైన స్థితిలో ఉండాలని, అందుకోసం అందరూ కంకణబద్ధులుగా నిలబడాలని హిందూ జన సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మీనరసింహమూర్తి కోరారు. ఒంగోలు రంగారాయుడు చెరువు వద్ద ఉన్న బ్రాహ్మణ సేవా సమితి శుభప్రదం కమ్యూనిటీ భవనంలో ఆదివారం హిందూ జన సంఘ్ ఆధ్వర్యంలో అర్చకులు, పురోహితులు, వేదపండితులకు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న లక్ష్మీనరసింహమూర్తి మాట్లాడుతూ దేశంలోని ప్రజలంతా సర్వేజనాసుఖినోభవంతు లోకా సమస్త సుఖినోభవంతుగా ఉండాలని కోరుకుంటారని తెలిపారు. ఒంగోలు నగర ప్రముఖ వేద పురోహితుడు వ్యామజాల ప్రసన్నకుమార్ మాట్లాడుతూ సనాతన ధర్మం గురించి రాబోయే రోజుల్లో హిందూ జన సంఘ్ ఆధ్వర్యంలో మరిన్ని సమావేశాలు నిర్వహిస్తామన్నారు. వ్యవస్థాపక అధ్యక్షులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

సంగీత కళాకారుల ప్రమాణ స్వీకారం



నాగేశ్వరమ్మను సన్మానిస్తున్న సంగీత కళాకారుల సమాఖ్య సభ్యులు

ఒంగోలు మెట్రో: ప్రకాశం జిల్లా సంగీత కళాకారుల సమాఖ్య ప్రమాణ స్వీకారం, అభినందన సభను ఆదివారం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు నక్క సుకుమార్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఎస్‌కే బాబు, ప్రధాన కార్యదర్శి ఆములూరు మనోహర్, కోశాధికారి ఉప్పుతెర్ల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎన్.పాండురంగనాథం, సీహెచ్ నాగేశ్వరమ్మ, ఎం.రాజకుమారి, సలహాదారులు మద్దుల నరసింహారావు, ఏల్చూరి అనంతలక్ష్మి, సంయుక్త కార్యదర్శులు నాగేంద్రబాబు, సీహెచ్‌వీ నాగరాజు, టి.శ్రీదేవి, కే లక్ష్మీప్రసన్న, కార్యవర్గ సభ్యులు యు.లక్ష్మీతులసి, కే యశోద, సీహెచ్ శేషారత్నం, డి.నిర్మలమ్మ, వి.ఆదాము, విజయరాజ్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఇటీవల ఉగాది పురస్కారం అందుకున్న డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మను సన్మానించి అభినందనలు తెలిపారు.

- ఒంగోలు జీజీహెచ్‌లో ఆదివారం అన్ని ఓపీ కౌంటర్ల మూసివేత
- ఎక్స్‌రే, ల్యాబ్‌లు కూడా మూసివేయడంతో ఎమర్జెన్సీ కేసులకు సైతం అందని వైద్య పరీక్షలు
- అన్ని విభాగాల ప్రధాన గేట్లకు తాళాలు
- కనిపించని వైద్యసిబ్బంది
- అత్యవసర చికిత్స అవసరమైన పేదలకు అవస్థలు



ఒంగోలు జీజీహెచ్‌లో ఆదివారం మూసివేసిన ఓపీ కౌంటర్లు



ఎముకల విభాగంలో కనిపించని వైద్యులు



సాధారణ వైద్య విభాగానికి తాళం వేసి ఉన్న దృశ్యం

పెద్దాస్పత్రికి ఆదివారం సెలవట..

పేద రోగులకు కటకట!

ఒంగోలు టౌన్:

అది జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్). అందరూ పెద్దాస్పత్రి అని కూడా పిలుస్తుంటారు. జిల్లాలోని బీద బిక్కి జనాలు వైద్య సేవలు పొందేందుకు ఈ ఆస్పత్రే దిక్కు. ముఖ్యంగా ఒంగోలు, కందుకూరు, కొండపి, సంతనూతలపాడు, దర్శి నియోజకవర్గాలలోని వివిధ గ్రామాలకు చెందిన వందలాది మంది నిరుపేదలు, సామాన్యులు వైద్య సేవల కోసం నిత్యం ఈ ఆస్పత్రికి వస్తుంటారు. ఇక, జాతీయ రహదారిపై ఎక్కడైనా సరే రోడ్డు ప్రమాదాలు జరిగితే ఇక్కడికి తరలించి అత్యవసర వైద్య సేవలు అందిస్తుంటారు. సాధారణ రోజుల్లో ఈ ఆస్పత్రికి రోజుకు 1000 నుంచి 1200 మందికిపైగా రోగులు వస్తుంటారు. అత్యవసర సేవల విభాగంలో ప్రతిరోజూ కనీసం 100 నుంచి 150 మంది వరకు అడ్మిట్ అవుతుంటారు. ఆస్పత్రిలో 800 పడకలు ఉన్నాయి. వందల సంఖ్యలో వైద్య సిబ్బంది ఉన్నారు. అయితేనేం ప్రయోజనం... ఆదివారం ఆస్పత్రిలో జనరల్ ఓపీ విభాగానికి సెలవు కావడంతో ఆ రోజంతా పేద రోగులకు అవస్థలు తప్పడం లేదు. జనరల్ ఓపీకి సెలవు అనే కారణంతో ఇతర అన్ని విభాగాలను మూసివేస్తుండటంతో ఆదివారం ఆస్పత్రిలో ఒక్కరు కూడా కనిపించలేదు. ఓపీ విభాగంలోని కౌంటర్లన్నీ మూసివేసి ఉన్నాయి. ఆస్పత్రిలోని ఎముకల విభాగం, జనరల్ వైద్య విభాగం, నేత్ర చికిత్స విభాగం.. ఇలా ఏ విభాగం చూసినా తాళాలు వేసి ఉన్నాయి. సాధారణ రోజుల్లో ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ గది వద్ద రోగుల రద్దీ కనిపిస్తుంటుంది. కానీ, ఆదివారం ఒకరిద్దరు మినహా పెద్దగా ఎవరూ లేరు. ఎక్స్‌రే, ల్యాబ్‌లకు కూడా తలుపులు వేసి ఉంచడంతో అక్కడ కూడా రోగులెవరూ లేరు. దీనివలన ఎమర్జెన్సీ వార్డుకు అత్యవసర చికిత్స కోసం వచ్చిన వారికి కూడా వైద్య పరీక్షలు చేసి సకాలంలో సరైన చికిత్స అందించే అవకాశం లేకుండా పోయింది.



స్కానింగ్ విభాగం ఖాళీ



ఎక్స్‌రే గది తలుపులు బంద్

ఆర్ఎంఓ కార్యాలయానికి సైతం తాళం...

ఆదివారం చివరకు ఆస్పత్రి నిర్వహణ చూడాల్సిన ఆర్ఎంఓ కార్యాలయానికి కూడా తాళం వేసి కనిపించింది. ఆ పరిసరాల్లో కనిపించిన సిబ్బందిని విచారిస్తే.. ఆదివారం కదా.. అందుకే ఎవరూ రాలేదని చెప్పడం గమనార్హం. అన్ని విభాగాలకు చెందిన వైద్యులు క్యాజువాలిటీలో ఉంటారని చెప్పారు. దాంతో క్యాజువాలిటీకి వెళ్లి చూడగా, వైద్యులు, స్టాఫ్ నర్సులు, హౌస్ సర్జన్లు మినహా స్పెషలిస్ట్ వైద్యులెవరూ లేరు. ఆదివారం వస్తే జనాలకు అత్యవసర వైద్యం అవసరం ఉండదా.. వైద్య నిపుణుల అవసరం రాదా.. ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు చేయించుకోరా..? అని అక్కడకు వచ్చిన సామాన్య జనాలు చెప్పుకోవడం వినిపించింది. ఆదివారం వస్తే చాలు.. నగరంలోని ప్రైవేటు వైద్యశాలలు కూడా మూసివేస్తుంటారు. కొన్ని ప్రైవేటు హాస్పిటల్స్‌లో కొంత మంది వైద్యులు మాత్రమే మధ్యాహ్నం వరకు ఉండి ఓపీలు చూసుకుని ఆ తర్వాత ఆస్పత్రి మూసేసి వెళ్లిపోతుంటారు. మరికొంత మంది ఆదివారం రెట్టింపు ఓపీ ఫీజులు వసూలు చేస్తున్నారు. దాంతో ఆదివారం, సెలవురోజు ఏదైనా సమస్య వస్తే ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. ప్రథమ చికిత్స కోసమైనా ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చూపించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. సెలవురోజు ప్రైవేటు వైద్యశాలలను మూసివేస్తున్నందున.. కనీసం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఓపీ వైద్య సేవలు అందుబాటులో ఉంటే బాగుంటుందని ప్రజలు అంటున్నారు. లేకుంటే అత్యవసర వైద్యం అవసరమైన పేద రోగులు ఏమైపోవాలని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు ఆర్ఎంఓకు ఫోన్ చేయగా, అందుబాటులోకి రాలేదు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటా



పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న చుండూరు రవిబాబు

- పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు భరోసా ఇచ్చారు. ఆదివారం ఒంగోలులోని గోపాలకృష్ణ కళ్యాణ మండపంలో నగరంలోని 5, 6, 7 డివిజన్లకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుండూరు రవిబాబు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తాను ఆదుకుంటానని, ఐదు నిమిషాల్లో మీ ముందు ఉంటానని అన్నారు. మీ డివిజన్లలో మీ ఉత్సాహం చూస్తుంటే రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి అత్యధిక మెజారిటీ వస్తుందని గట్టిగా విశ్వసిస్తున్నానన్నారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, 5, 6, 7 డివిజన్ల అధ్యక్షులు చదలవాడ సత్యన్నారాయణరెడ్డి, కటారి సాయి సంజీవ్‌కృష్ణ, షేక్ జఫ్రుల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు జనార్దన్‌రెడ్డి, సునీల్‌కుమార్, దేవ, అబ్దుల్ ఖుద్దూస్, దేవరపల్లి రమణ, వాణి, మేరీకుమారి, ప్రసన్న, కొణికి రోశయ్య, మర్రి సాయికుమార్‌రెడ్డి, పి.శ్రీనివాసరెడ్డి, మిరియం వెంకటేశ్వర్లు, అసోది యలమందారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైమరిపించిన వీణా వాదనం



సంగీత ప్రదర్శన నిర్వహిస్తున్న మద్దులూరి లక్ష్మీ వసుంధర బృందం

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఒంగోలుకు చెందిన లలితా గాయత్రి సంగీత నిలయం కళాకారులు మద్దులూరి లక్ష్మీ వసుంధర బృందం ఆదివారం తమ వీణా వాదనం సంగీత ప్రదర్శనతో భక్తులు, కళాభిమానులను తన్మయులను చేశారు. ముద్దుగారే యశోద, చక్కటి తల్లికి చాంగు భళా, అదివో అల్లదివో వంటి తాళ్లపాక అన్నమాచార్యులు విరచిత సంకీర్తనలతో పాటు పాహి రామా ప్రభో వంటి పలు భక్తిరస సంకీర్తనలను వీణలపై సుతారంగా పలికించి వీణా వాదనంలో తమ ప్రజ్ఞను రుజువు చేసి కళాభిమానుల అభినందనలు అందుకున్నారు. చక్కటి వీణా వాదనం సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులను పలువురు అభినందించారు. వీణా వాదనం సంగీత కళాకారులు మద్దులూరి లక్ష్మీ వసుంధర, ఎస్‌జీ ప్రవల్లిక, ఎం.మానసిలను శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారితో పాటు ఆలూరు జై శంకర్ అభినందించి సత్కరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, సంగీతాభిమానులు హాజరయ్యారు. భక్తులకు శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

30న మద్దిపాడు మండల సర్వసభ్య సమావేశం

మద్దిపాడు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 30వ తేదీ ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డీవీఎస్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు. నివేదిక సమర్పించే అధికారులు మంగళవారం నాటికి ఎంపీడీవో కార్యాలయానికి ఆయా శాఖల అధికారుల నుంచి సమాచారం ఇవ్వాలని ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారు.

మాజీ మంత్రి సురేష్‌కు సంతనూతలపాడు నాయకుల శుభాకాంక్షలు

సంతనూతలపాడు: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం సింగరాయకొండలో నిర్వహించిన వేడుకల్లో ఆ పార్టీ సంతనూతలపాడు నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. సంతనూతలపాడు జెడ్పీటీసీ, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి దంపతులు సురేష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట సంతనూతలపాడు సిండికేట్ రైతు సొసైటీ మాజీ అధ్యక్షుడు దుంపా యల్లమందారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మేధావులు సంఘ సంయుక్త కార్యదర్శి మండవ కిరణ్‌కుమార్, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు కె.శేఖర్‌రెడ్డి, నాయకులు వసంతరావు, మహిళా విభాగం నేతలు మాధవి, ప్రభావతి, తదితరులు పాల్గొని మాజీ మంత్రి సురేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



ఆదిమూలపు సురేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నేతలు

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నూతన పాలకవర్గం ఏకగ్రీవం

ఒంగోలు సిటీ: ప్రభుత్వ ఉద్యోగుల సంఘ ఒంగోలు తాలూకా శాఖ నూతన పాలకవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని సంఘ భవనంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా షేక్ మసూద్ అలీ, సహాయక ఎన్నికల అధికారిగా శ్రీనివాస్ యాదవ్ వ్యవహరించారు. నూతన పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అధ్యక్షునిగా అనుమాల సురేష్, కార్యదర్శిగా కె.శ్రీదేవి, కోశాధికారి డాక్టర్ జి.వెంకటరామిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.వనజ, ఉపాధ్యక్షులుగా ఆర్.శ్రీనివాసరెడ్డి, కె.అంకబాబు, జె.చంద్రశేఖర్, షేక్ కరిముల్లా, యం.వి.బాబూరావు, డి.రాజ్యలక్ష్మి, బి.గౌరీ, ఆర్.సుధాకర్, ఎస్.కె.జోహార్‌వలి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డాక్టరు ప్రమిద, జాయింట్ సెక్రటరీలుగా కే ప్రసన్న, ఏ హరిబాబు, కే సందీప్, కే ప్రతిమ, జి.సుజాత, ఎం.సునీత, డి.మాచిరాజు ఎన్నికయ్యారు. వీరిని జిల్లా శాఖ అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి అభినందించారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన ఒంగోలు తాలూకా శాఖ నూతన పాలకవర్గం

ఆర్థిక లావాదేవీలపై లోకోస్ శిక్షణ

మద్దిపాడు: మండల మహిళా సమాఖ్య, డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో ఆదివారం సమైక్య సంఘాల ఆర్థిక లావాదేవీలపై లోకోస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఏపీఎం కాకుమాను సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ట్రైనర్లు పి.ఈశ్వరి, పి.ముబినా మద్దిపాడు మండల మహిళా సమాఖ్య, గ్రామ సమాఖ్యలలో జరుగుతున్న ఆర్థిక లావాదేవీలపై లోకోస్ శిక్షణ ఇచ్చారు. రెండు రోజుల శిక్షణలో భాగంగా ఆదివారం మొదటిరోజు శిక్షణ పూర్తిచేశారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు పల్లె శ్రావణి, ఎల్‌సీసీసీజీ వెంకటసుబ్బయ్య, మండలంలోని వీవోఏలు పాల్గొన్నారు.

పలువురు విద్యావంతులకు సన్మానం

కొత్తపట్నం: మండలంలోని కె.పల్లెపాలెం గ్రామాభివృద్ధికి కృషి చేస్తూ తమ చదువులతో మలితరం యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న పాత తరం విద్యావంతులు, ఉద్యోగులను గ్రామంలోని సీతారాముల కల్యాణ వేదికపై ఆదివారం సన్మానించారు. ఒంగోలులోని శ్రీరామ్ హాస్పిటల్ డాక్టర్ వంశీకృష్ణ, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది గ్రామ కాపులు, పెద్దలచే సన్మానం చేశారు. దేవదాయ శాఖ రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెయ్యాల వెంకటేశ్వర్లు, రిటైర్డ్ టీచర్ మోపిదేవి వెంకటేశ్వర్లు, బుక్కాపురం వెంకటనాయుడును సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చాపల కోటేశ్వరరావు, సీహెచ్ వినుకొండయ్య, చాపల శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

సంతనూతలపాడు: స్థానిక బస్టాండ్ సెంటర్లో వాసవీ క్లబ్, వాసవీ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో వాసవీ క్లబ్ జిల్లా ప్రతినిధి గ్రంధి లక్ష్మీప్రసాదరావు, సులోచన దంపతులు ఏర్పాటు చేసిన మినీ కూలింగ్ చలివేంద్రం వద్ద మూడో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. దాతలైన క్లాత్ మర్చంట్ ప్రతినిధులు నల్లమల్లి లక్ష్మీశ్రీనివాస్ కాంతారావు అలియాస్ శ్రీనివాసరావు, సుకన్య రాణి దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని మద్దిపాడు ఎంపీడీవో డీఎస్‌వీ ప్రసాద్, ఝాన్సీలక్ష్మి దంపతులు ప్రారంభించారు. వాసవీ క్లబ్ జిల్లా ప్రతినిధులు వేమూరి నాగేంద్రప్రసాదరావు, జీఎల్ ప్రసాదరావు పర్యవేక్షించారు.

సంస్కరణల పేరుతో విద్యను నిర్వీర్యం చేయొద్దు

- ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

ఒంగోలు: ప్రభుత్వ విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలు విద్యారంగాన్ని బలోపేతం చేసేలా ఉండాలేగానీ, నిర్వీర్యం చేసేలా ఉండకూడదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి అన్నారు. ఆదివారం ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో ఎస్టీయూ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కె.యర్రయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రఘునాథరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం రోజుకొక ప్రతిపాదన, పూటకొక సవరణ చేస్తూ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను తీవ్ర గందరగోళంలోకి నెట్టేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సంఘాలతోనూ, డ్రాఫ్టు రూల్స్‌లోనూ చర్చించేది ఒక రకంగానూ, కార్యాచరణ మాత్రం మరోరకంగానూ ఉండటం శోచనీయమన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖమంత్రి జోక్యం చేసుకుని గందరగోళ పరిస్థితులకు ముగింపు పలకాలన్నారు. లేని పక్షంలో ప్రభుత్వ పాఠశాలలు బలహీనమయ్యే ప్రమాదముందన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నప్పటికీ ఉపాధ్యాయ సంఘాలతో ముఖ్యమంత్రి ఒకసారైనా చర్చలు జరపలేదన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలే తప్ప ఎటువంటి ప్రత్యామ్నాయాలను అంగీకరించేది లేదన్నారు. పన్నెండో పీఆర్సీ గడువు సమీపించి రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ కమిషన్ ఏర్పాటు విషయంలోగానీ, మధ్యంతర భృతి విషయంలోగానీ చొరవ తీసుకోకపోవడం సరికాదన్నారు. వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పదకొండో పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలన్నారు. చనిపోయిన, పదవీ విరమణ చెందిన ఉద్యోగులకు సంవత్సరన్నర కాలంగా అర్ధవేతన నగదు చెల్లింపులు, గ్రాట్యుటీ చెల్లింపులు జరపకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. వెంటనే చెల్లింపులు చేయకపోతే ఉద్యమం చేపట్టక తప్పదన్నారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా అధ్యక్షుడు అశోక్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నరసింహారెడ్డి, ఆర్థిక కార్యదర్శి నాగయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు దొడ్డ తిరుపతిరెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు మాలకొండయ్య రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు సీహెచ్ ఆదినారాయణ, జిల్లా మాజీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ కడియాల ప్రసాద్, సంఘ నాయకులు చీకిరి గాలయ్య, మేకల మోహన్‌రావు గవిని శివశంకర్, ఖాదర్‌బాషా, పికిలి కొండయ్య, శ్రీనివాసులు, జి శ్రీనివాస్‌రెడ్డి, కాలంగి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాలభైరవ పూజలు

ఒంగోలు మెట్రో: ఒంగోలు స్వర్ణాకర్షణ కాలభైరవ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక మంగమూరురోడ్డులోని గాయత్రి మందిరంలో ఆదివారం ఉదయం విశ్వావసు నామ సంవత్సర మొదటి అమావాస్య సందర్భంగా కాలభైరవ చిత్రపటానికి ప్రముఖ పురోహితుడు మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు స్వర్ణాకర్షణ వారి ఆధ్వర్యంలో అన్న ప్రసాదాలు అందజేశారు. స్వర్ణాకర్షణ కాలభైరవ సేవా సమితి నిర్వాహకులు దేసు వెంకటసుబ్బారావు, పబ్బిశెట్టి భానుకిరణ్, పచ్చిపులుసు శ్రీకాంత్, దేసు కాశీవిశ్వేశ్వరరావు, మనోహర్, గద్దం రాజేష్, పచ్చిపులుసు లోకేష్, భాస్కరుని మురళీమోహన్, ప్రశాంత్ సుబ్బరాజు, సునీల్, కారంశెట్టి అమర్, సమితి సభ్యులు పాల్గొన్నారు.